## అమరావతి కథలు

### సత్యం శంకరమంచి



# నివేదన

మహాశివరాత్రినాడు వేలకొద్దీ యాత్రికులు తొక్కుకుంటూ, తోసుకుంటూ దేవాలయానికి వెళ్తున్న వేళ కోటిలింగం ఆరావడ మంచి కాలినడకన మొక్కు తీర్చుకుందుకు వచ్చాడు. ఎప్పటి మొక్కు? భార్యకి పెద్ద జబ్బు చేసి మందులూ-మాకులూ పనిచెయ్యకపోతే కోటిలింగం 'దాన్ని బతికించు తండ్రీ! పండుగనాడు నిన్ను కళ్ళారా జూసుకుని పొగిలిపోతాను' అని మొక్కుకున్నాడు. కాని ఈ ప్రార్థన కూడా పని చెయ్యలేదు. కాలం తీరి ఆమె వెళ్ళిపోయింది. కోటిలింగం పిచ్చివాడైపోయాడు. ఇంటిదీపం ఆరిపోయాక, గుమ్మానికి పసుపు రాసేవాళ్ళు లేక, తులసెమ్మకి నీళ్ళు పోసేవాళ్ళు లేక, ఎదురుగా పచ్చటి ముఖంతో పలకరించేవాళ్ళు లేక ఇల్లు బీడై, అడవై భయంకరంగా వుంటే, కోటిలింగం ఇల్లు వదలి, ఊరు వదలి, గుట్టలూ పుట్టలూ పట్టి తిరిగాడు. అన్నం, నీళ్ళూ మాని ఆరుబయళ్లో పడుకునే వాడు. చీకట్లో కీచురాళ్ళ మోతలూ, వెన్నెల్లో పాలపిట్ట కూతలూ రెండూ ఒకేలా వుండేవి. ఎండా వాన ఏవీ బాధించేవిగావు. లోపలా బయటా అంతా శూన్యంగా వుండేది. అలాంటి స్థితిలో పూరపతంగా వెట్టు కింద కూర్చున్న కోటిలింగం అర్థరాత్రివేళ చీకట్లో మెరుస్తున్న మిణుగురుల్ని చూస్తుంటే ఎందుకో గుండె కలుక్కుమంది. "ఒరేయ్, పండగనాడు నన్ను చూసి పొగిలిపడ్తానన్నావు. నన్ను చూట్టానికి రావురా?" అని అమరేశ్వరుడు పిలుస్తున్నట్లనిపించింది. "రారా! రారా!" అని మళ్ళీ పిలుపు. కోటిలింగం చెంగున లేచి మంచున్నాడు. మిణుగురులు మరీ మరీ మెరుస్తున్నాయి. "వస్తాను సామి! శివరాత్రికి నిన్ను జూసుకుని మొక్కు లిచ్చుకుంటా" అని చేతులు జోడించాడు.

మొక్కు తీర్చుకుంటానని ఆ యమ్మని, ఆ అయ్యని డబ్బులడుక్కుని కాలి నడకన వచ్చాడు కోటిలింగం. కిందటి సాయంత్రం జనంలో తిరుగుతుంటే ఆ డబ్బు సంచీ కాస్తా ఎవరో కొట్టేశారు. ఆ రాత్రి మంటపంలో పడుకుని కోటిలింగం "సామీ! డబ్బులుంటే ఎంగిలిపడ్తాడు. ఉపవాసం చెయ్యడని ఆ డబ్బు లాగేసుకున్నావా నాయనా! రొండిన పావలా వుంచావు. అది నీ కొబ్బరికాయకు సరిపోతుందిలే సామీ" అనుకుని శివనామ స్మరణలో మునిగిపోయాడు.

తెల్లతెల్లవారుతుండగా కృష్ణలో స్నానం చేసి, కొనుక్కున్న కొబ్బరికాయని తడిపి, పసుపురాసుకుని స్నానాలు చేస్తున్న ముత్తయిదువుల్నడిగి పసుపు, కుంకుమ తీసుకుని కొబ్బరికాయకి బొట్టుపెట్టి, నీళ్ళోడుతున్న బట్టలతో కోటిలింగం గుళ్ళోకొచ్చాడు. అప్పటికే వందలాది జనం 'హర హర మహాదేవ' కేకలు. రద్దీ విపరీతంగా వుంది. తడిబట్టల్తో యాత్రికులు తోసుకుంటూ ముందుకెళ్తున్నారు. కోటిలింగం వొళ్ళు పొంగిపోతోంది. ఎటు చూసినా శివ నామ స్మరణ; అందరి ముఖాల్లో కాంతి - అందరి కళ్ళలో వెలుగు; అంతా శివమయంగా వుంది.

"సాంబా! సాంబా!" అనుకుంటూ తన్మయంతో వొళ్ళంతా తేలికై పోతుండగా కోటిలింగం కూడా ద్వారం దగ్గరకెళ్ళాడు. అక్కడ జవాను ఆపేశాడు. గుళ్ళో కెళ్ళాలంటే పావలా ఇచ్చి చీటీ తీసుకోవాలన్నాడు. కొందరు అతనితో వాదిస్తున్నారు.

"దేవుణ్ణి చూడ్డానికి చీటీ ఏమిటండీ?"

"మామూలు రోజుల్లో లేదు కదండీ!"

"ఇదేం సినిమాటండీ టిక్కెట్టు తీసుకోడానికి?"

"డబ్బు లున్నోళ్ళకే దేవుడు కనపడతాడటండీ?"

జవాను అందరికి సమాధానం చెప్పాడు. "నాకు తెలియదు శివరాత్రినాడింతే"

"రామ నవమినాడు భద్రాద్రిలో కూడా ఇంతేనండి" అని జనంలోంచి ఎవరో సమర్థించారు. అందరూ సమాధానపడి టిక్కెట్లు తీసుకుని గుళ్ళో కెళ్తున్నారు. కోటిలింగం దిగాలు పడిపోయాడు. జవాన్ని ప్రార్థించాడు. "బాబూ! నా దగ్గర డబ్బుల్లేవు. నాకు సామిని చూపించవూ?" - జవాను విన్పించుకోలేదు. "వెళ్ళెళ్ళు. ఇది రూలు" అని తోసేశాడు. జనం తోసేశారు. కోటిలింగం ఇవతల కొచ్చి పడ్డాడు. కోటిలింగానికి కళ్ళనీళ్ళు కారిపోతున్నాయి. మళ్ళీ జవాన్ని తోసుకుంటూ జవాను దగ్గరకొచ్చి అతని పాదాల మీద పడ్డాడు. "బాబూ, నీ కాళ్ళు పట్టుకుంటాను. నాకు సామిని చూపించు. కావాలంటే ఈ కొబ్బరికాయ నువ్వు తీసుకో..." జవాను కాళ్ళు వదిలించుకుని "ఫో ఫో! కొబ్బరికాయ కూడా వుందా? కాయకి మరో చీటీ తీసుకోవాలి" అని తోసేశాడు. జనం మళ్ళీ తోసేశారు. కోటిలింగం ద్వారానికి దూరమైపోయాడు. మంత్ర పుష్పాలకి, అభిషేకాలకి చీట్లు కొనుక్కుని గుళ్ళోకి వెళ్తున్న వేలాది యాత్రికుల్ని దిగులుగా చూస్తున్నాడు. "పండుగనాడు నా సామిని నేను చూసుకోలేనా, నా దేవుడికి నేను మొక్కుకోలేనా?" అని కుమిలిపోతున్నాడు. కారుతున్న కన్నీళ్ళు, చేతనున్న కొబ్బరికాయ మీద పడ్తుంటే కాయకున్న పసుపు, కుంకుమలు కరిగిపోతున్నాయి. కోటిలింగం పిచ్చెత్తిపోతున్నాడు. స్వామి దర్శనం కోసం అన్ని ద్వారాల వైపు పరుగెత్తుతున్నాడు.

తూర్పు ద్వారం దగ్గర కొచ్చాడు. జనం - జనం తలలు. ఆపైన ఎక్కడో నంది. ఆ నందీశ్వరుడి కొమ్ములకి పైగా లింగాకారము! అల్లదే అమరేశ్వరుడు! గంటల మోతలు... ఈశ్వరుడి ఫాల భాగం... మళ్ళీ తలలు... జనం... దేవుడు సాంతం కన్పించడం లేదు... వెర్రెత్తి పోతున్నాడు కోటి లింగం.

"నా సామి! నా సామి!" అంటూ ప్రాకారమంతా

## ముత్యాల వాన

పరుగులు తీస్తున్నాడు. "నా సామిని కళ్ళారా చూడలేనా?" అంటూ పిచ్చి చూపులు చూస్తున్నాడు. అన్ని ప్రకారాలు తిరుగుతున్నాడు. మారేడు చెట్టుని, గన్నేరు చెట్టుని "నాకు సామిని చూపించవా?" అని అడుగుతున్నాడు. చుట్టు గుళ్ళలోని వినాయకుణ్ణి, కుమారస్వామిని "మీ అయ్యని నాకొక్కసారి చూపించరా?" అని ఏడుస్తూ అడుగుతున్నాడు. చుట్టు గుళ్ళ గడపల మీద తలబాదుకుంటున్నాడు.

మధ్యాహ్నమయింది. యాత్రికుల రద్దీ తగ్గలేదు. కోటిలింగం ఉన్మాదంగా తిరుగుతూనే వున్నాడు. రాత్రయింది. జనం తగ్గలేదు. కోటిలింగం "సాంబా కన్పించవా?" అంటూ ధ్వజస్తంభానికి తల మోదుకుంటున్నాడు. కోటిలింగానికి నీరసం వచ్చేసింది. ధ్వజస్తంభానికి ఆనుకుని కన్పించని స్వామి కెదురుగా కూర్చున్నాడు. గుళ్ళో మహా రుద్రాభిషేకం జరుగుతోంది. జనం రొదలో కొబ్బరికాయ వళ్ళో పెట్టుకుని "సాంబా! సాంబా" అనే కోటిలింగం మూలుగు ఎవరికీ విన్పించలేదు.

గర్భగుళ్ళో మహారుద్రాభిషేకం ఆఖర్న గంటలు గణగణ మోగుతుంటే, లింగోద్భవ కాలాన ప్రాకారాలు 'హర హరా' అని మార్మోగుతుంటే కోటిలింగం చేతుల్లోని కొబ్బరికాయ టప్‌మని పగిలి రెండుగా విడిపోయింది. 'సాంబా' అనే మూలుగు ఆగిపోయింది.